క్లుప్తంగా

వెంటనే రుణమాఫీ చేయాలి



బోధన్: రుణమాఫీ పొందని రైతులకు వెంటనే రుణాలను మాఫీ చేయాలని జాడిజమాల్పూర్ సొసైటీ సభ్యులు తీర్మానించారు. సాలూర మండలంలోని జాడిజమాల్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ శుక్రవారం చైర్మన్ దాసరి అంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ సీఈవో శివరామకృష్ణ ఆదాయవ్యయాలను, ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సొసైటీ పరిధిలో 217మందికి గాను 125మంది రైతులకు మాత్రమే పంట రుణ మాఫీ వచ్చిందని, మిగిలిన 92మందికి వెంటనే రుణ మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతు తీర్మానం ఆమోదించారు. వైస్ చైర్‌పర్సన్ అనూషబాయి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మంత్రికి మద్దతుగా తీర్మానం



కమ్మర్‌పల్లి: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా కమ్మర్‌పల్లి ముస్లిం కమిటీ తీర్మానం చేసింది. శుక్రవారం స్థానిక మసీదులో ముస్లిం కమిటీ సభ్యులు సమావేశమై వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికే ఓట్లు వేస్తామని నిర్ణయించారు. తీర్మానప్రతిని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్‌కు అందజేశారు. ముస్లిం కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి



బోధన్: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు పట్టణంలో చేపట్టిన నిరవధిక సమ్మె పదోరోజు శుక్రవారం కొనసాగింది. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనం చెల్లించాలని వారు కోరారు.

కుల వ్యవస్థ వ్యతిరేక పోరాటాలు చేపట్టాలి



బోధన్: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కుల వ్యవస్థ వ్యతిరేక పోరాటాలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. పూలే స్థాపించిన సత్య శోధక సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం సాలూర మండలంలోని ఖాజాపూర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుల వివక్షను నిర్మూలించాలన్నారు. నాయకులు పడాల శంకర్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవీపేట: ప్రస్తుత వాతావరణంలో కలిగే మార్పులతో పాటు తీసుకునే కలుషిత ఆహారంతో కొత్త రోగాలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన ఆయుష్మాన్‌భవ హెల్త్ మేళాలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు నిర్వహించే ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం వైద్యులు రోగులను పరీక్షించారు. జెడ్పీటీసీ సవిత, తదితరులు పాల్గొన్నారు.

జీవో నం.245 అమలు చేయాలి



వర్ని: మధురా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చే 245 జీవో ఆరు రోజుల్లో సీఎం కేసీఆర్ అమలు చేయాలని, లేదంటే ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీగా 1116నామినేషన్లు వేసి తమ తడాఖా చూపిస్తామని రాష్ట్ర లబానా సంఘం అధ్యక్షుడు తాన్‌సింగ్ హెచ్చరించారు. మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే జీవోను అమలు చేస్తూ, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్ కల్పించాలని, పోడు భూముల పట్టాలు ఇస్తూ రైతు బంధు ఇవ్వాలని, లబానా బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నిమజ్జనం... శోభాయమానం..




యంచ గోదావరి వంతెనపై బారులు తీరిన వినాయకుడి శోభాయాత్ర వాహనాలు





డొంకేశ్వర్‌లో సత్య గణపతి శోభాయాత్ర.. ఆర్మూర్‌లో నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకుడు



యంచ గోదావరిలో వినాయకుడి నిమజ్జనం



బోధన్‌లోని పసుపు వాగులో గణనాథుని నిమజ్జనం

డొంకేశ్వర్(ఆర్మూర్)/ఆర్మూర్ టౌన్/రుద్రూర్/బోధన్‌రూరల్(బోధన్)/నవీపేట: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు భక్తులు పూలందుకున్న లంబోధరుడు గంగమ్మ వద్దకు పయనమయ్యాడు. ఈసందర్భంగా నిర్వహించిన వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర పలుప్రాంతాల్లో శుక్రవారం రెండోరోజు కొనసాగింది. ఆర్మూర్‌లోని గోల్‌బంగ్లా వద్ద శోభాయాత్రకు ప్రజలు భారీగా తరలివచ్చి వీక్షించారు. పట్టణంలోని పలు యువజన సంఘాలు నిర్వహిస్తున్న వినాయక నిమజ్జనంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే డొంకేశ్వర్‌లోని కట్టె గణపతి ముగింపు ఉత్సవాలకు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హాజరయ్యారు. సత్య గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రూర్‌లో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన జాతర, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సార్వజనిక్, శ్రీనవ యుగ గణేశులను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. గణేశ్ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్‌ను సన్మానించారు. బోధన్‌లో గణనాథుల శోభాయాత్ర, నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. గణేష్ నిమజ్జనానికి పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, శోభాయాత్రను పర్యవేక్షించారు. బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమీషనర్ కమర్ అహ్మద్, శ్రీ సార్వజనిక్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగం బాగారెడి, మున్సిపల్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బందిలు నిమజ్జనం పూర్తి అయ్యేవరకు పర్యవేక్షణ చేశారు. నవీపేట మండలంలోని యంచ శివారులోని గోదావరి నదిలో భారీ గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. అన్ని ఏర్పాట్లతో పాటు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.



డొంకేశ్వర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



రుద్రూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డి



రుద్రూర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు..



బోధన్‌లో ఉత్సవ విధుల్లో పాల్గొన్న అధికారులు



ఆర్మూర్‌లో నృత్యాలు చేస్తున్న యువకులు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయండి



ఆర్మూర్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆర్మూర్: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారిని విద్యాశాఖలో విలీనం చేయాలని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఫోన్‌లో విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని కోరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే, విద్యాశాఖ మంత్రికి ఫోన్ చేసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. జేఏసీ నాయకులు రాజు, అంజయ్య, గంగామణి, సునీల్, సునీత, ప్రమీళ, శ్రీనివాస్, జలంధర్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ హనుమాన్ ఆలయ పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పెర్కిట్/నందిపేట్: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామం, నందిపేట మండలంలోని తల్వేద, ఉమ్మేడ గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నాయకులు సాయన్న తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అప్పుడే నాణ్యతగా జరుగుతాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వర్ని, చందూర్, మోస్రా మండలాల్లో సుమారు రూ.50 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివద్ధి పనులకు శుక్రవారం ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల, ప్రజల పర్యవేక్షణలేక కొన్ని ప్రాంతాల్లో నాణ్యత లోపిస్తుందని, దీనిని నివారించడానికి పర్యవేక్షణ చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో వందకు వందశాతం బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొంది దేశంలోనే చరిత్ర సృష్టించనున్నారని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, వర్ని మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు మూడు కవిత, ఉపాధ్యక్షులు గోపాల్, ఎంపీపీలు లావణ్య, పిట్ల ఉమా శ్రీరాములు, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం

చందూర్ మండలంలోని మేడిపల్లి, లక్ష్మీ సాగర్ తండా, మాటు కాలువ తండా, నడమితండాతోపాటు చందూరు మండల కేంద్రంలో 14 కుల సంఘాల వారు స్పీకర్‌కు మద్దతు ప్రకటించారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి, తీర్మాన పత్రాలను స్పీకర్‌కు అందజేశారు.

సంక్షిప్తం

రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేత



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ శుక్రవారం చైర్మన్ బార్ల భరత్‌రాజ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం పలువురు రైతులకు పంట రుణ మాఫీ చెక్కులను పంపిణీ చేశారు. డైరెక్టర్లు పెంటన్న, రాజన్న, ముత్యం, గంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన మగ్గిడి అజయ్, శిరీష దంపతులు పరీక్ష ప్యాడ్లను వితరణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

నందిపేట్: మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో శుక్రవారం మండల పశువైద్య అధికారుల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, సర్పంచ్ తొంటి లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ–మేరా దేశ్'

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో శుక్రవారం తపాలశాఖ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ–మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తపాలశాఖ అధికారులు విశ్రాంత ఉపాధ్యాయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఏలేటి శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానించి, వారి ఇంటి ముందు మట్టిని సేకరించారు. తపాలశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట్‌లోని మహాలక్ష్మి ఆలయ ప్రహరీ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. నాయకులు శ్రీధర్, ఇంద్రకరణ్, నాగభూషణ్, సర్పంచ్ సాయిలు తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి, రాజేశ్వర్, ఉప సర్పంచ్ కిషన్, దాసరి వెంకటేశ్ పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండలంలో..

భీమ్‌గల్: మండలంలోని చేంగల్ గ్రామంలో శుక్రవారం వివిధ అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ రవి, ఎంపీపీ మహేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సయ్య శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కటకం చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నాక్స్‌గా బిస్కెట్లు అందజేశారు. లయన్స్ అధ్యక్షుడు జ్ఞానసాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ..

బాల్కొండ: ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నాగాజ్యోతి పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

బాల్కొండ: బాల్కొండలో శుక్రవారం దోమల నివారణకు జీపీ ఆధ్వర్యంలో నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. మురికికాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పర్యటన

పోతంగల్(రుద్రూర్): పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారపోయించారు. సర్పంచ్ పుష్పలత అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేసి అవయవదానంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకం

వేల్పూర్: మండలంలోని రామన్నపేట్ గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు బోరుబావి తవ్వకం పనులు చేపట్టారు. సర్పంచ్ వీణ పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ శోభన్‌రెడ్డి, నాయకులు పిప్పిర ప్రవీన్, దేవీప్రసాద్, రేగుల్ల రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కోటగిరి: మండల కేంద్రంలోని హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ నరహరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



బాల్కొండ: దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్ అన్నారు. మండలంలోని కిసాన్‌నగర్‌లో శుక్రవారం ఆయన వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లాలోనే కిసాన్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో డెంగీ కేసులు రెండో స్థానంలో ఉన్నాయన్నారు. ఇంటింటికీ జ్వరం సర్వేను వెంటనే నిర్వహించాలన్నారు. వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆశా, అంగన్‌వాడీల సమ్మె



డొంకేశ్వర్‌లో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు



కోటగిరిలో సమ్మె నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు



బోధన్‌లో అంగన్‌వాడీల భిక్షాటన



కమ్మర్‌పల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్/మాక్లూర్/రుద్రూర్/బోధన్/నవీపేట/వర్ని/బాల్కొండ/కమ్మర్‌పల్లి: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది వేర్వేరుగా చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. డొంకేశ్వర్‌లో అంగన్‌వాడీల సమ్మెకు బీజేపీ నేత పైడి రాకేశ్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. బోధన్, బాల్కొండలో అంగన్‌వాడీ సిబ్బంది భిక్షాటన చేసి, నిరసన తెలిపారు. నవీపేటలో అంగన్‌వాడీల సమ్మెకు సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు, కమ్మర్‌పల్లిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మద్దతు తెలిపారు. అలాగే రుద్రూర్‌లో ఆశా వర్కర్ల సమ్మెకు సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు. బోధన్‌లో ఆశాల సమ్మెకు జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రతినిధి జంగం గంగాధర్, సాగర్ సంఘీభావం తెలిపారు. వర్నిలో ఆశా వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని, నిరసన తెలిపారు. మాక్లూర్‌లో రహదారిపై ఆశా వర్కర్లు రాస్తారోకో చేశారు. అనంతరం వారు తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



రుద్రూర్: అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరిలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో స్మశానవాటిక కాంపౌండ్‌వాల్ నిర్మాణంలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కోటగిరి మండలం నుంచి పక్క జిల్లా గ్రామాలకు యథేచ్ఛగా మొరం తరలిస్తున్నారని అన్నారు. అధికారులకు వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ మనోహర్, మాజీ ఎంపీపీ గంగాధర్‌దేశాయ్, షాహిద్, వహిద్, ఆయుబ్, అబ్బయ్య, హన్మంత్, హైమద్ పాల్గొన్నారు.

తగ్గిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులకు తగ్గించారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 11వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. లక్ష్మి కాలువ ద్వారా 200క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు)అడుగులు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్ట్ నిండకుండల ఉంది.

ఎస్సెస్సీ మెమోలు ఇవ్వండి



వర్ని: గతేడాది ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెమోలు ఇప్పటికీ రాలేవని, వెంటనే అందించాలని ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన సంఘ నాయకులతో కలిసి వర్ని తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జెండా బాలాజీ పండుగ



నందిపేట్: మండలంలోని వెల్మల్ గ్రామంలో శుక్రవారం జెండా బాలాజీ పండుగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా భక్తులు బాలాజీకి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం జరిగిన జెండా ఊరేగింపులో బీజేపీ నాయకుడు పైడిరాకేష్ రెడ్డి, ఆయన కుమార్తె సుచరితరెడ్డి పాల్గొని, పూలజు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వేల్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు తెలంగాణ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబి వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఇతర నాయకులు, అధికారులు శంకుస్థాపన నిర్వహించారు. జెడ్పీటీసీ అల్లకొండ భారతి, ఆర్మూర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, డీఐవో డాక్టర్ అశోక్, వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్, బీఆర్ఎస్ నాయకులు కోటపాటి నర్సింహానాయుడు, రేగుల్లరాములు, జైడి నాగధర్‌రెడ్డి, రాకేశ్‌చంద్ర, లింబారెడ్డి, సర్పంచులు ఏనుగు గంగారెడ్డి, ఆరె నితీష్‌కుమార్, సాద రమేశ్, సాద చందన్, సుధాకర్‌గౌడ్, పత్రి రాజేశ్వర్, రిక్క మహేశ్ పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించుటకు అతిథి అధ్యాపకుల కోసం ఒప్పంద ప్రాతిపదికన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, పీజీ ఉత్తీర్ణత చెందిన వారు అర్హులు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులను రాత పరీక్ష, డెమో ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 3లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫుక్రేయ్-(హిందీ) – 12.30, 7.10, 10.25, జవాన్(తెలుగు)- 3.45
స్క్రీన్-2 –	స్కంద – 11.00, 2.30, 6.00, 9.30
స్క్రీన్-3 –	పెదకాపు1- 12.40, 7.20, 10.30 స్కంద – 03.50
స్క్రీన్-4 –	చంద్రముఖి2 (తెలుగు)- 11.45, 3.05, 6.25, 9.45